క్లుప్తంగా

బహిరంగ వేలం వాయిదా

సీటీఆర్ఐ: కోటిలింగాలపేటలోని ఉమా కోటి లింగేశ్వస్వామి, సీతారామస్వామి దేవస్థానానికి చెందిన భూముల వేలాన్ని వాయిదా వేసినట్టు కార్యనిర్వాహణాధికారి బీహెచ్‌వీఆర్ మూర్తి ప్రకటనలో తెలిపారు. దేవస్థానానికి చెందిన బొమ్మూరులోని సర్వే నంబర్ 62లో గల భూమిని 11 ఏళ్ల కాలపరిమితికి లీజుకి ఇవ్వడానికి సోమవారం వేలం జరగాల్సి ఉందన్నారు. అయితే వర్షం కారణంగా వాయిదా వేశామని, తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ తెలియజేస్తామన్నారు.

మణిపూర్ ఘటనలపై విద్యార్థినుల నిరసన



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరిగిన అమానుష ఘటనలు దారుణమని రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ. కళాశాల విద్యార్థినులు నిరసన తెలిపారు. కళాశాల ఆవరణ నుంచి బయలుదేరి గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ ఆఫీస్ వరకూ ర్యాలీ చేశారు. అనంతరం ఆర్డీఓ చైత్రవర్షిణికి వినతి పత్రం అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ తేతలి సత్య సౌందర్య, సిబ్బంది పాల్గొన్నారు.

29న ఏపీ సీపీఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం

తాళ్ళపూడి: ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ నూతన జిల్లా కార్యవర్గ ఎన్నిక సమావేశాన్ని ఈ నెల 29న రాజమహేంద్రవరంలోని ఎన్జీవో హోమ్‌లో నిర్వహించనున్నట్టు ఆ సంఘ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి పశ్చిమగోదావరి నాయకుడు జోడాల వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. ఆసక్తి, నాయకత్వ లక్షణాలు గల సీపీఎస్ ఉద్యోగులు ఈ సమావేశానికి విధిగా హాజరు కావాలని కోరారు.


21, 22వ తేదీల్లో ఏపీ ఎన్జీవో మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న నగర అధ్యక్షుడు వైవీఎస్ నాయుడు

రాజమహేంద్రవరం సిటీ: విజయవాడలో ఆగస్టు 21, 22వ తేదీల్లో నిర్వహించే ఏపీ ఎన్జీవో 21వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ ఎన్జీవో నగర అధ్యక్షుడు వైవీఎస్ నాయుడు కోరారు. సోమవారం నగర ఎంజీవో హోమ్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హాజరవుతారన్నారు. రాజమహేంద్రవరం నగర శాఖ నుంచి సుమారు 500 మంది మహాసభలకు తరలివెళ్లాలన్నారు. సమావేశంలో నగర కార్యదర్శి ప్రవీణ్ కుమార్, రాష్ట్ర జేఏసీ కార్యదర్శి వేణుమాధవ్, నగర సహాధ్యక్షుడు అనిల్ కుమార్, ప్రతినిధులు మాధవరావు, ప్రతాప్, దురాని, రాఘవరావు, రాజు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	హిడింబ
సూర్యమినీ	మిషన్ ఇంపాసిబుల్
సూర్యప్యాలెస్	బేబీ
స్వామి	హిడింబ
అశోక	అన్నపూర్ణ ఫొటో
స్టూడియో	
శివజ్యోతి	సామజవరగమన
అనుశ్రీ	కాజల్‌కార్తీక
రాజా	బేబీ
ఊర్వశి	హత్య
రంభ	ఒప్పెన్‌హైమర్
మేనక	హెర్, రంగబలి
అప్సర	బేబీ
నామవరం	
వీఎస్ మహల్	హిడింబ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	బేబీ
కడియం	
వెంకటసూర్య	హిడింబ

బ్యాడ్మింటన్‌లో పతకాల పంట



బ్యాడ్మింటన్ జిల్లా అండర్ 11 విభాగంలో విజేతలు

- సత్తా చాటుతున్న క్రీడాకారులు
- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రకాశం నగర్: బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా స్థాయి క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి ఎంపికల్లో చోటు దక్కించుకుంటున్నారు. ఇటీవల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం మున్సిపల్ స్టేడియం, టీఎస్ఎన్ ఇండోర్ స్టేడియాల్లో రెండు రోజుల పాటు జరిగిన బ్యాడ్మింటన్ క్రీడాపోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అండర్ 11, 13, 15, 17, 19, మెన్స్ లెట్రన్స్ విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి. అండర్ 11 నుంచి 19 వరకూ పోటీల్లో బాలుర విభాగంలో 10 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో 20 మంది ఆ ఘనత సాధించారు. అండర్ 11 విజేతలు మలికిపురంలో, అండర్ 13 విజేతలు ఒంగోలులో, అండర్ 15 విజేతలు విశాఖపట్నంలో, అండర్ 17 విజేతలు నెల్లూరులో అండర్ 19 విజేతలు తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

> **స్పందన బాగుంది**
>
> ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వారందరికీ అల్పాహారం, భోజన వసతి వంటి సౌకర్యాలను అసోసియేషన్ సమకూర్చింది. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జక్కంపూడి రాజా పర్యవేక్షణలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ ఎంపికలకు మంచి స్పందన వచ్చింది.
>
> – డీవీవీ త్రినాథ్, అసోసియేషన్ అధ్యక్షుడు

క్రీడాకారుల ప్రతిభ

అండర్ 11 బాలుర విభాగంలో వి.నిశాంత్, నిఖిల్ వర్మ, జి.తుషాంత్, అండర్ 13 విభాగంలో కె.చైతన్య, వి.చైతన్య, అండర్ 15 విభాగంలో హరికృష్ణ , గౌతమ్, అభిషేక్, అమిత్, రోషిత్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. అండర్ 11 బాలికల విభాగంలో బి.దివ్య, జె.సాహిత్య, బి.భావన, యశశ్రీ , అండర్ 13 విభాగంలో శ్రీహిత, ఉషశ్రీ, నక్షత్ర, వైష్ణవి, దివ్య, అండర్ 15 విభాగంలో త్రీషిత, మనోజ్ఞ, శ్రీహాసిని, కె.ఉషశ్రీ, అండర్ 17 విభాగంలో అపర్ణ, అండర్ 19 విభాగంలో సంజనా రెడ్డి, సుమశ్రీ, సౌజన్య, గీతా హరిణీ, ఎ.లోహిత విజేతలుగా నిలిచారు. వారికి పతకాలు, టీషర్టులు ప్రదానం చేశారు.

గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షణ్‌పై విస్తృత ప్రచారం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ: గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షణ్ ముఖ్య ఉద్దేశంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేపట్టాలని కలెక్టర్ కె.మాధవీలత పిలుపు నిచ్చారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో స్వచ్ఛ ఆంధ్రా మిషన్ కార్పొరేషన్ పంపిణీ చేసిన గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామాల రూపకల్పన దిశలో గ్రామీణ ప్రజలను భాగస్వాములు చేస్తూ ప్రచారం చేపడుతున్నామన్నారు. ఆ దిశలో ఘన, ద్రవ వ్యర్థాల నుంచి సంపద సృష్టించేలా అడుగులు వేయాలన్నారు. జలజీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ లక్ష్యాలను సాధించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. గ్రామీణ ప్రాంతాల పారిశుద్ధ్య స్థితిని అంచనా వేసే కీలకమైన పరిమాణాత్మక, గుణాత్మక స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీన్) పనితీరు ఆధారంగా జిల్లాలకు ర్యాంకింగ్ ఇస్తారన్నారు. అందులో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేలా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జేవీ సత్యనారాయణ, డ్వామా పీడీ జీఎస్ రామ్‌గోపాల్, జిల్లా ప్రాజెక్ట్ రిసోర్స్ పర్సన్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఏపీడీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేసేందుకే ప్రజాప్రస్థానం



సమావేశంలో మాట్లాడుతున్న ముకుంద్

సీటీఆర్ఐ: విశాఖ జిల్లాలో స్వచ్ఛందంగా సేవలు అందించి అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేసిన తాను ప్రజాప్రస్థానం పేరుతో రాజకీయ పార్టీని స్థాపించినట్టు ముకుంద్ తోట వెల్లడించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పుడు తమ సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించే క్రమంలో గడప గడపకూ వెళ్లి ప్రజల కష్టాలు తెలుసుకోవాలని కార్యాచరణ చేస్తున్నామన్నారు. మా ప్రేమ ట్రస్టు ద్వారా విశాఖ జిల్లాలో అనేక సేవలు అందజేశామన్నారు. అన్ని మతాలు, కులాలు, ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు న్యాయవాదులు, ఇంజినీర్లు, విద్యావేత్తలు, మేధావులను రాజకీయాల్లోకి ఆహ్వానించి వారికి తమ పార్టీ సీట్లు కేటాయించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. ప్రజలకు సేవ చేయాలనుకున్న లక్ష్యంతో ఎవరైతే ముందుకొస్తారో వారికే 175 సీట్లలో పోటీకి అవకాశం కల్పిస్తామన్నారు. సమావేశంలో పడాల వాసు పాల్గొన్నారు.

ఘనంగా వెంకట రమణయ్య జయంతి



ఇన్నీసుపేటశాఖా గ్రంథాలయంలో దాతలను సత్కరిస్తున్న ప్రముఖులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య జయంతి నిర్వహించారు. ముఖ్య అతిథులుగా యునైటెడ్ ఇండియన్ ఇన్స్యూరెన్స్ లిమిటెడ్ విశ్రాంత డివిజనల్ మేనేజర్ బి.మురళి, విశ్రాంత ఎల్ఐసీ పరిపాలనాధికారి అడవి శివ రామ్ హాజరయ్యారు. అయ్యంకి వెంకటరమణయ్య విగ్రహానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. గ్రంథాలయం సభ్యురాలు అలంక సత్యవతి గ్రంథాలయాలనికి రూ.2500 విలువైన ఫ్యాన్, ట్యూబ్‌లైట్లను, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తమ్మన అఖిల రూ.2500 విలువైన పుస్తకాలను బహూకరించారు. దాతలు ఇద్దరినీ అతిథులు సత్కరించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఆర్.నరసింహ మూర్తి, డి.చంద్రశేఖర్, సీతా శారద, పద్మావతి, లైబ్రేరియన్ పి.శ్రీదేవి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజానగరం: జీవనాధారమైన కాఫీ హోటల్ కాలిపోయి నిరాశ్రయులైన కొండగుంటూరుకు చెందిన ఈలి ఆంజనేయులు కుటుంబానికి సోమవారం జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం, నిత్యావసరాలను అందించారు. గ్యాస్ సిలిండర్ పేలడంతో సంభవించిన ఈ ప్రమాదంలో సుమారు రూ.రెండు లక్షల వరకూ ఆస్తినష్టం వాటిల్లింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తక్షణ సాయంగా రూ.10 వేలతో పాటు బియ్యం, నిత్యావసరాలను వైఎస్సార్ సీపీ నాయకుల ద్వారా బాధితులకు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, పార్టీ నాయకులు గంగిశెట్టి సోమేశ్వరావు, ఉరింకల శ్రీను, వేమగిరి కృష్ణ, గిరజాల రామకృష్ణ, పెమ్మనబోయిన వెంకటరమణ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ లబ్ధి

పెదపూడి: జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులందరికీ లబ్ధి చేకూరుతోందని ఎంపీడీఓ పి.వి జయభాస్కర్ అన్నారు. పుట్టకొండ గ్రామంలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష గ్రామసభకు పుట్టకొండ, చింతపల్లి సర్పంచులు వల్లు వెంకట రమణ, కొల్లు లోవకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుభాష్, చింతపల్లి గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కొల్లు సత్తిబాబు, సచివాలయం కార్యదర్శి మనోజ్, వీఆర్వో మంగాలక్ష్మి పాల్గొన్నారు.

కాటన్ సేవలు చిరస్మరణీయం



కాటన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ముద్దాల అను

రాజమహేంద్రవరం రూరల్: గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను అన్నారు. కాటన్ వర్ధంతి సందర్భంగా ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో బొమ్మూరు కొత్తపేటలో సోమవారం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముద్దాల అను మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రైతుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. బొమ్మూరు మాజీ ఉపసర్పంచ్ దాకే శ్రీనివాసరావు, ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజాయోనా పాల్గొన్నారు.

బ్రాస్‌లెట్ చోరీ

రాజమహేంద్రవరం రూరల్: తన కుమార్తె హ్యాండ్ బ్యాగ్‌లోని 8 గ్రాముల బంగారం బ్రాస్‌లెట్ చోరీకి గురైందని ప్రకాశం జిల్లాకు చెందిన పి.విజయకుమారి సోమవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె కుమార్తె జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ఫైనలియర్ చదువుతూ, లాలాచెరువులోని ఉమెన్ హాస్టల్లో ఉంటోంది. బ్యాగ్‌లో పెట్టిన 8 గ్రాముల బంగారపు బ్రాస్‌లెట్‌ను ఈనెల 16వ తేదీన చూసుకోగా కనిపించలేదు. బొమ్మూరు ఎస్సై జగన్‌మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుల్లా ఆంజనేయులుకు సత్కారం



పుల్లా ఆంజనేయులును సత్కరిస్తున్న సంజీవ్ రెడ్డి

కడియం: విజయవాడలో ఆంధ్ర నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీసత్యదేవా నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులును ఘనంగా సత్కరించారు. ఆంధ్ర నర్సరీ అసోసియేషన్ ప్రెసిడెంట్ సంజీవ్ రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఆంజనేయులుకు శాలువా కప్పి, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో పుల్లా రాజశేఖర్, నర్సరీ రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



బొబ్బిల్లంక, ములకల్లంక మధ్య గోదావరిలో బోటుపై ప్రయాణిస్తున్న ప్రజలు

సీతానగరం: అఖండ గోదావరి వరద మధ్యలో ఉన్న ములకల్లంకలో పారిశుధ్యం మెరుగుపై పంచాయతీ కార్యదర్శి రజాక్ ప్రత్యేక దృష్టి సారించారు. సోమవారం గ్రామంలోని వీధుల్లో పేరుకు పోయన మట్టిని పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. చెత్తాచెదారం, వ్యర్థాలను శుభ్రం చేసి, బ్లీచింగ్ వెదజల్లారు. అలాగే బొబ్బిల్లంక, మునికూడలి ఏటిగట్టును ఆనుకుని గోదావరి వైపు నివాసాల వద్ద ఆయా గ్రామ పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. బొబ్బిల్లంక నుంచి ములకల్లంక వద్ద గల లంకభూములలో వ్యవసాయం చేసుకునే రైతులు పడవలపై ప్రయాణం సాగిస్తున్నారు. తహసీల్దార్ ఎస్. సత్యనారాయణ, ఎంపీడీవో కె.రమేష్, ఎస్సై కె.చిరంజీవి ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని గమనిస్తూ, సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

ఆస్పత్రికి వెళ్లి.. పింఛన్ పంపిణీ



కాకినాడ ఆస్పత్రిలో వెంకట రమణకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ వెన్నెల గౌరి

సీటీఆర్ఐ: స్థానిక 15వ డివిజన్ తాడితోటలోని 29వ సచివాలయ పరిధిలో ఉంటున్న శీరం వెంకట రమణ దివ్యాంగుడు. అతడికి ప్రతినెలా పింఛన్ వస్తోంది. అయితే అనారోగ్య కారణంతో జూలైలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ వెన్నెల గౌరి రాజమహేంద్రవరం నుంచి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేసింది. దీనిపై వెంకట రమణ ఆనందం వ్యక్తం చేశాడు. వలంటీర్ తన యోగక్షేమాలు తెలుసుకోవడమే కాకుండా తాను ఆసుపత్రిలో ఉంటే ఇక్కడికి వచ్చి పింఛన్ అందజేసిందన్నారు.

సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి




తొర్రేడులో రోడ్లను పరిశీలిస్తున్న చందన నాగేశ్వర్

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- తొర్రేడులో రోడ్లు, డ్రైనేజీల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలోని రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. సోమవారం ఆయన తొర్రేడు గ్రామంలో ముంపునకు గురైన రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆర్అండ్‌బీ రోడ్డు నీటమునగడంతో ఆశాఖ జేఈ జి.వీరన్నబాబు, పార్టీ నాయకులతో కలిసి చందన నాగేశ్వర్ ఆ ముంపునకు గల కారణాలను తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో నీరు ముందుకు వెళ్లడం లేదని, ఏటా వర్షాకాలంలో సమస్య తలెత్తుతోందని పార్టీ నాయకులు వివరించారు. వర్షం నీరు నిల్వ ఉండడంతో ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా దెబ్బతింటోందన్నారు. రోడ్లు, డ్రైనేజీల సమస్యలు ఉత్పన్నం కాకుండా శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మండల ఇంజినీరింగ్ అధికారి సంపత్ కుమార్, ఆర్అండ్‌బీ జేఈ వీరన్నబాబును చందన ఆదేశించారు. కార్యక్రమంలో హుకుంపేట సొసైటీ చైర్‌పర్సన్ చిట్టూరి వెంకటరావు, పార్టీ నాయకులు ఉప్పులూరి రాము, దండమూడి అర్జునరావు, గద్దె సుబ్బారావు, దాసరి గోపాలకృష్ణ, మిరియం నెహ్రూ, పాలడగుల శ్రీధర్, పాలడగుల వెంకటేష్ పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో తాత్కాలిక ఉద్యోగి మృతి



దుర్గాప్రసాద్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో తాత్కాలిక ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కోర్టు ఆవరణలో ఓ కార్యాలయాన్ని తెరిచేందుకు సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో సిబ్బంది వచ్చారు. అక్కడ కోర్టులో బెంచ్‌క్లర్క్‌గా ఉద్యోగ విరమణ చేసి ప్రస్తుతం తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్న ఆర్యాపురానికి చెందిన ఆకుల దుర్గాప్రసాద్ (63) విగతజీవిగా పడిఉన్నాడు. వెంటనే సిబ్బంది కోర్టు ఉన్నతాధికారులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి ఇన్‌స్పెక్టర్ మధుబాబు, ఎస్సై అమీనాబేగం చేరుకున్నారు. మృతుడి పక్కనే పురుగు మందు సీసా ఉండడంతో దానిని తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గత రాత్రి అదృశ్యం

ఆకుల దుర్గాప్రసాద్ ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. సోమవారం ఉదయం వరకూ రాకపోవడంతో అతడి కుమారుడు వెంకటసాయి రమణకాంత్ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చాడు. ఈలోపు దుర్గాప్రసాద్ మృతి చెందిన విషయాన్ని పోలీసులు అతడికి తెలిపారు. దుర్గాప్రసాద్ కోర్టు బెంచ్‌క్లర్క్‌గా విధులు నిర్వహించి 2017లో ఉద్యోగ విరమణ చేశాడు. ప్రస్తుతం అక్కడే తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు, కోడలు ఉన్నారు.

ఫీవర్ సర్వే వివరాలు అప్‌లోడ్ చేయాలి



స్పందనలో పాల్గొన్న కమిషనర్ దినేష్ కుమార్



అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ చైత్రవర్షిణి

రాజమహేంద్రవరం సిటీ: ఫీవర్ సర్వే వివరాలను వలంటీర్లు త్వరితగతిన పూర్తిచేసి, ఎప్పటికప్పుడు డేటాను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఫీవర్ సర్వేను ఇప్పటి వరకూ 83 శాతం పూర్తి చేశారని, ఇంకా 17 శాతం డేటా అప్లోడ్ చేయాల్సి ఉందన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు వర్తించని వారిని జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గుర్తించి, పథకాలు అందజేయడంలో వలంటీర్లు ముఖ్యభూమిక పోషించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సత్యవేణి, సిటీ ప్లానర్ వైబీఆర్ చంద్రబోస్, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు పాల్గొన్నారు.

సత్వరమే అర్జీల పరిష్కారం

సీటీఆర్ఐ: ప్రజలు అందజేసిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని రెవిన్యూ డివిజనల్ అధికారి ఏ.చైత్రవర్షిణి అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆమె వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి దేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

ప్రకాశం నగర్: శ్రీదేవి కళ్యాణ మండపం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కుసుమ నాగన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కమిటీ సభ్యులు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఏడేళ్లుగా తమ విద్యార్థులకు నోట్ పుస్తకాలను ఉచితంగా అందజేస్తున్న శ్రీదేవి కళ్యాణ మండపం కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

హోరువాన

గోకవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండల వ్యాప్తంగా సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. భారీ వర్షాలకు చెరువులు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. గోకవరం శివారున రంపయర్రంపాలెం వెళ్లే మార్గంలో చెరువు పొంగడంతో రహదారిపై నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఏజెన్సీలో కురిసిన భారీ వర్షాలకు ఊరకాలువలోకి వరద నీరు చేరడంతో ఉధృతంగా ప్రవహించింది. సంజీవయ్యనగర్‌లోని సప్టాపై ఊరకాలువ ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి.

తడిసిముద్దయిన మెట్ట

రంగంపేట: మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలో సోమవారం తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు వర్షం కురుస్తునే ఉంది. దీనితో జన జీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై ఉన్న గోతుల్లో నీరు చేరడంతో రాకపోకలకు ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా ఈ వర్షం వరిసాగు చేసే రైతులకు ఎంతో ఉపయోగపడనుంది. నారుమడులు ఎదుగుదలకు, ఆకుతీతకు, దమ్ము చేయడానికి, నాట్లు వేయడానికి వీలుగా మడులలో నీరు చేరింది. ఇప్పటికే వరినాట్లు వేసిన చేలకు ఈవర్షం ఊపిరిపోసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.